క్లుప్తంగా

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

రాజోళి: గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం ఎండలు తీవ్రం అవుతుండటంతో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



అయిజ: మండల కేంద్రంలోని మూగోనిపల్లిలో నిర్వహించిన గ్రామ దేవతల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సందెపురాళ్ల ఎత్తుపోటీల్లో విజేతలైన వారికి గురువారం బహుమతులు ప్రదానం చేశారు. పోటీలో గుడేబల్లూరు సూరికి రూ.11,016 నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, పరుష రామ్, నర్సన్‌గౌడ్, భీమన్న, శశిధర్, రమేష్, తిరుమలేష్, ప్రజలు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మకు అరకేజీ వెండి వితరణ



శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో వెలసిన రేణుక ఎల్లమ్మ తల్లికి రామచంద్రానగర్‌కు చెందిన ఆరె కటిక వెంకోజీ, ఆయన కుమారులు రఘు, శివతేజలు 500 గ్రాముల వెండి వితరణ చేశారు. వెండితో జమ్ములమ్మ అమ్మవారికి కిరీటం, నాగపడగ చేయిస్తే బాగుంటుందని ఆలయ నిర్వాహకులు చెప్పడంతో వారు అందుకు అంగీకరించి అరకేజీ వెండికి సంబంధించిన నగదును అందజేశారు. అమ్మవారికి పెద్ద మొత్తంలో నగదును అందించిన భక్తులను ఆలయ నిర్వాహకులు అభినందించారు.

తహసీల్దార్‌కు సన్మానం



ధరూరు: మండల తహసీల్దార్‌గా వెంకట్రావు బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. గురువారం మండలంలోని మాల్‌దొడ్డి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త అంజి సాగర్ తహసీల్దార్‌ను కలిసి శాలువా, పూల మాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

రాజోళి: రాజోళిలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న వెంకటరమణ గురువారం ఉండవెల్లి మండలానికి బదిలీ అయ్యారు. గత వారంలో తహసీల్దార్, ఆర్‌ఐ బదిలీ కాగా, తాజాగా డిప్యూటీ తహసీల్దార్ కూడా బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన రాజోళి నుంచి రిలీవ్ అయ్యారు.

అభ్యసన సామర్థ్యాల ఆధారంగా బోధించాలి



ధరూరు: అభ్యసన సామర్థ్యాల ఆధారంగా బోధన జరగాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలో వంటలు చేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలతో మాట్లాడారు. వంటలు రుచితో పాటు శుచి, శుభ్రత పాటించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని, యూడైస్ ప్లస్‌లో విద్యార్థుల వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం మరింత పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట సీఆర్‌పీ నర్సింహులు ఉన్నారు.

మందుబాబులకు అడ్డాగా..

మానవపాడు: ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిచాలనే లక్ష్యంతో పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. కళాశాలలో ప్రహరీ నిర్మాణాలు లేక అడ్డగోలుగా మందుబాబులు కళాశాల ఆవరణలో సంచరిస్తున్నారు. కళాశాలలు, పల్లెప్రకృతి వనాలు మందుబాబులకు అడ్డగా మారాయి. పట్టించుకునే నాథుడు కరువయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



హరితహారం అభాసుపాలు

- మొక్కలకు నిప్పు పెడుతున్న గుర్తు తెలియని వ్యక్తులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులు
- ప్రభుత్వ ధనం వృథా..
- పట్టించుకోని అధికారులు



మానవపాడు బృహత్ పల్లెప్రకృతి వనంనకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు

మానవపాడు: ప్రభుత్వం అడవులను పెంచాలనే లక్ష్యంతో హరితహారం చేపట్టింది. దాదాపు 9 హరితహార కార్యక్రమాలను ఆయా గ్రామాల్లో ప్రారంభించింది. వాటి ఫలితాలు మాత్రం క్షేత్రస్థాయిలో నిరుగారుతున్నాయి. రాష్ట్రంలో వర్షాలు సకాలంలో కురిసేలా అడవుల శాతం పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. చాలా చోట్ల హరితహారం అభాసుపాలవుతోంది. నాటిన మొక్కలకు పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ ద్వారా నీటిని అందించి కంటికి రెప్పలా కపాడటంతో అవి ఏపుగా పెరిగాయి. కానీ చెట్లుగా మారిన తర్వాత సంరక్షించడంలో అధికారులు విఫలం అవుతుండటంతో అవి కనుమరుగవుతున్నాయి.

రోడ్ల వెంట మొక్కలు..

మండలంలోని 16 గ్రామాల్లో హరితహారం మొక్కలు నాటుతున్నారు. ప్రతి గ్రామంలో దాదాపు 10వేల మొక్కలు నాటేందుకు ప్రతి ఏటా అధికారులు ప్రణాళికలతో సిద్ధం చేస్తున్నారు. రోడ్ల వెంటా, పల్లెప్రకృతి వనాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటుతున్నారు. రోడ్ల పక్కన నాటిన చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్ల వెంట ఉన్న మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు తొలగిస్తున్నారు. కష్టపడి నాటిన మొక్కలు కనుమరుగవుతున్నాయి.

అధికారులు స్పందించాలి..

మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో ఆయా శాఖల అధికారులు హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను కొట్టేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చెట్ల చుట్టూ వరిగడ్డి ఉన్న చోటా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెడుతున్నారు. దీంతో హరితహారం మొక్కలు కాలిపోతున్నాయి.



గోకులపాడు రోడ్ల వెంట హరితహారం మొక్కలను తొలగిస్తున్న విద్యుత్ అధికారులు

మొక్కలు కొంచెం పెరగగానే విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు కొమ్మలు తొలగిస్తున్నారు. పంచాయతీ అధికారులు మళ్లీ అదేప్రాంతంలో మొక్కలను నాటుతున్నారు. మొక్కలను అధికారులు లెక్కలకోసం నాటుతున్నారా? లేక సంరక్షణ కోసం నాటుతున్నారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం కారణంగా తూతూ మంత్రంగా మొక్కలు నాటుతున్నారని మండలంలో ప్రజలు ఆరోపిస్తున్నారు.

దూరంగా వనాలు...

మండలంలోని 16 గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామాలకు దూరంగా పల్లెప్రకృతి వనాలు నాటారు. అధికారులు వనాలను తూతూ మంత్రంగా నిర్మించి వదిలేశారు. కానీ ఒక్క గ్రామంలో కూడా హరితహారం పల్లెప్రకృతి వనాల లక్ష్యం ఏమిటో? దాని ఉపయోగం ఏమిటో? ఎందుకు నాటారో? తెలియని పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు వనాలు నిర్మించాలంటే నిర్మించాం అన్న తీరుతో మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు ఏర్పాటు చేశారు, వదిలేశారు. ఇప్పటికైనా హరితహార లక్ష్యం పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మండలంలోని ఆయా గ్రామాల్లో మొక్కలకు నిప్పంటించిన విషయం మా దృష్టికి రాలేదు. హరితహారంలో భాగంగా నాటిన చోట మొక్కలను నాటకుండా, మొక్కలను తొలగించకుండా అడవులను పెంచాలనే ప్రభుత్వం లక్ష్యాన్ని చేరుకోవాలి. ఎక్కడైనా మొక్కలకు నిప్పంటించి, మొక్కలను తొలగిస్తే చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ, మండల పర్యవేక్షకులు

తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు



మిషన్‌భగీరథ అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

గద్వాల రూరల్: గద్వాల పట్టణంలో నెలరోజులుగా పలువార్డులలో మిషన్‌భగీరథ తాగునీరు సరఫరాపై ఇబ్బందులు తలెత్తుతున్నాయని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ మిషన్‌భగీరథ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన తన ఛాంబర్‌లో మిషన్‌భగీరథ అధికారులతో సమీక్షించారు. రాబోయేది ఎండాకాలం ఇప్పుడే తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తే ముందుముందు ఇంకెంత ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుందని, ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే మీరు ఎందుకు అవసరమైన చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఇక మీదట తాగు నీటి ఇబ్బందులు తలెత్తితే సహించేది లేదని, ఎక్కడెక్కడా సమస్యలున్నాయో ముందస్తుగా గుర్తించి అందుకు తగ్గట్టుగా అవసరమైన చర్యలు తీసుకుని అంతరాయం లేకుండా ప్రజలకు తాగునీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సందీప్, ఏఈ నితీష్‌రెడ్డి, మిషన్‌భగీరథ అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గద్వాలన్యూటౌన్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు యూనుస్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అభ్యసన ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ టీఎస్ జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఏడేళ్లుగా పదోన్నతుల కోసం, ఐదేళ్లగా బదిలీల కోసం ఎదురుచూస్తు నిరాశలో ఉన్నారని చెప్పారు. నూతన ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో ఆశతో ఉన్నారని, వారి ఆకాంక్షలు నెరవేరే విధంగా జోన్-2లో నిలిచిపోయిన పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసి ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర కార్యదర్శి చెన్నకేశవులు మాట్లాడుతూ 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, మండలాల బాధ్యులు కృష్ణయ్య, కిషోర్, చంద్ర, శంకర నాయక్, జయరాజు, సుదర్శన్, నయూమ్, చక్రధర్, జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనుస్ పాషా

మౌలాన అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో మౌలాన అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద అధ్యాపకుల నివాళి

గద్వాల అర్బన్: మొదటి విద్యాశాఖ మంత్రి మౌలాన అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకోని గురువారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు అబుల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా మాట్లాడారు. విద్యాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు చేసిన మహోన్నత వ్యక్తి అబుల్ కలం ఆజాద్ అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు మంజులత, నర్సింహులు, నాగభూషణం, పవన్‌కుమార్, కళాశాల ఏఓ మక్బూల్ అహ్మద్ ఉన్నారు.

ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో

మౌలాన అబుల్ కలం వర్ధంతి సందర్భంగా ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ మార్గ్ రోడ్డులోని అబుల్ కలం ఆజాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

మౌలాన అబుల్ కలం వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు గురువారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్ రోడ్డులోని అబుల్ కలం ఆజాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. స్వాతంత్ర ఉద్యమంలో మౌలాన అబుల్ కలం ఆజాద్ చురుగా పాల్గొని పోరాటం చేశారన్నారు. విద్యపై ప్రత్యేక దృష్టి సారించి మంచి కార్యక్రమాలు చేసి ఘనకీర్తులు సాధించిన వ్యక్తుల్లో మౌలాన అబుల్ కలం ఆజాద్ కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో నాయకులు యూసుఫ్, ఇసాక్, డీటీడీసీ నర్సింహ్మ, నాగేందర్ యాదవ్, కౌసర్ బేగ్, జహంగీర్, హఫీజ్ ఉన్నారు.



మౌలాన అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రక్తదాన శిబిరం విజయవంతం

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 30 మంది విద్యార్థిని, విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్ అభినందించారు. కార్యక్రమంలో గద్వాల బ్లడ్ బ్యాంక్ సిబ్బంది డాక్టర్ తేజశ్రీ, రాకేష్ బృందం, అధ్యాపకులు వెంకటేష్, బీసన్న, ప్రదీప్‌కుమార్, జలంధర్‌బాబు, రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ డా.శివనారాయణ, డా.ఏడుకొండలు, జీవా, జయరాజ్‌లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గట్టు: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. గొర్లఖాన్‌దొడ్డి వాగు నుంచి అదే గ్రామానికి చెందిన పాలెం ఈరన్న అనుమతి లేకుండా ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా కానిస్టేబుళ్లు నర్సింహులు, కృష్ణయ్యలు పట్టుకున్నారు. ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతి పత్రాలు లేక పోవడంతో ట్రాక్టర్‌ను గట్టు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైల్వే పోలీసులకు మహిళ అప్పగింత

గద్వాల క్రైం: పోలీసుల అదుపులో ఉన్న మహిళను రైల్వే పోలీసులకు అప్పగించినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాత్రి నదిగ్రహారంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న భవితను గ్రామ ప్రజలు పోలీసులకు అప్పగించారు. విచారణలో సదరు మహిళ బీహార్ రాష్ట్రానికి చెందిన మహిళగా గుర్తించారు. మానసిక స్థితి లేనందున్న తన బ్యాగ్‌లో ఇనుప కత్తులు, గ్లౌజులు, ఇతర వస్తువు సామగ్రిని పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం గద్వాల రైల్వే పోలీసుల సహాయంతో మహిళను స్వరాష్ట్రానికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. స్వరాష్ట్రానికి చేరిన తర్వాత రైల్వే పోలీసుల సమక్షంలో వారి బంధువులకు అప్పగించడం జరుగుతుందన్నారు. పట్టణంలో ఎవరైనా అనుమానాస్పందగా కాలనీలో సంచరించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దాడులు చేస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు.

కస్తూర్బాలో సమస్యలు తీర్చండి



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. పాఠశాలలో మొత్తం 240 మంది విద్యార్థులు ఉండగా ప్రభుత్వం నుంచి కేవలం 200 మంది విద్యార్థులకు మాత్రమే పుస్తకాలు, దుస్తులు, నోట్ పుస్తకాలు అందుతుండటంతో మిగిలిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో తరగతి గదుల సమస్య లేనప్పటికీ, డార్మిటరీలో విద్యార్థులు పుస్తకాలు, బట్టలతో పాటు బస చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఎర్రవల్లి కూడలికి దాదాపు 2కిలో మీటర్ల దూరంలో ఉండటం వల్ల నిత్యం పోలీస్ పెట్రోలింగ్ కూడా లేకపోవడంతో పాఠశాలకు వెళ్లే రోడ్డుపై మద్యం బాబుల వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధి కారులు పలుమార్లు పాఠశాలను సందర్శించి కోరిని పూడ్చేస్తామని హామీ ఇచ్చినా, సమస్య నేటికి తీరలేదని విద్యార్థులు తెలిపారు. ఇప్పటికైనా పాఠశాలలోని కోరిని పూడ్చి, పాఠశాలకు ప్రహరిని నిర్మించి తమ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



పాఠశాలలో ఉన్న పెద్దకోరి

ఘనంగా మడివాల మాచిదేవ విగ్రహప్రతిష్ఠ



మల్దకల్ మడివాల మాచిదేవ విగ్రహప్రతిష్ఠలో హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు



పూజలు నిర్వహిస్తున్న నాయకులు

మల్దకల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మడివాల మాచిదేవ ఆలయంలో గురువారం నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి వేదపండితులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, ప్రసన్నచారి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఈ ప్రతిష్ఠాపనకు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. దీంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, బాబురావు, వేదపండితులు, ఆలయ నిర్వాహకులు, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రారంభమైన తిమ్మప్పస్వామి ఉత్సవాలు



పందిరి పూజలో పాల్గొన్న భక్తులు

అయిజ: పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి 26 వరకు నిర్వహించనున్న ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు ఉదయం భక్తులు పందిరి నిర్మించి, పూజ చేశారు. వేదపండితులు సాయంత్రం అన్నవరం సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. రాత్రి చిన్న రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉయ్యాల సేవ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఆలయ కమిటీ వారు భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కస్తూర్బాలో స్వయం పరిపాలన దినోత్సవం



గట్టులో స్వయం పరిపాలన నిర్వహిస్తున్న కస్తూర్బా విద్యార్థినులు

గట్టు: కస్తూర్బా విద్యాలయంలో గురువారం విద్యార్థినీలు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఉపాధ్యాయులుగా మారి చక్కగా విద్యాబోధన చేశారు. ప్రిన్సిపాల్‌గా స్వాతి, రాధిక, డీఈఓగా ప్రియాంక, ఎంఈఓగా మరియమ్మ, మరికొంత మంది విద్యార్థినులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రత్యేక అధికారిణి గోపీలత ఆధ్వర్యంలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో రాఘవేంద్ర కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా పర్వేజ్ పాష, డిఈఓ ఇలియాస్, హెడ్మాస్టర్ నరేష్, మరో16మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి మాట్లాడారు. సాటి విద్యార్థులే ప్రముఖులు, ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధించడం ద్వారా వారిలో ఉన్న మెలకువలను తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, భీసన్న, మహేందర్ ఉన్నారు.



ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి



మల్లాపురం గ్రామాన్ని సందర్శించిన ఎన్‌ఆర్‌ఐ బృందం

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటించి పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఎన్‌ఆర్‌ఐ ఫోరం సభ్యులు రవి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్లాపురం, మల్లాపురంతండా, సిద్దన్‌పల్లి గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఐ బృందం పర్యటించి పాఠశాలలు తనిఖీ చేసింది. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి బృందం సభ్యులు మాట్లాడారు. ఆయా తరగతుల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం ఎంపీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెమిడియల్ తరగతుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ పాండు ఎన్‌ఆర్‌ఐ సభ్యులు శ్రీకాంత్, హెచ్‌ఎం వరలక్ష్మి, సులేమన్ ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలకు ఫ్యాన్ల వితరణ

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గురువారం దాతలు శ్రావణ్‌కుమార్, హసన్‌లు 10 ఫ్యాన్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల తరగతి గదులలో ఎండకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే ఫ్యాన్లు వితరణ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు మంచిగా చదివి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌లింగం, లెక్చరర్లు రామాంజనేయులుగౌడ్, నర్సింహులుగౌడ్, గోవర్ధన్‌శెట్టి, బాగ్యలక్ష్మి, దేవసేనరెడ్డి, శ్రీనాథ్, తిమ్మోతి, రవిప్రకాష్‌శెట్టి, జయరాం పాల్గొన్నారు .



ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

క్రీడా మైదానాలు ఏర్పాటు చేయండి

అయిజ: మండలంతో పాటు మున్సిపాలిటీలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడామైదానాలు లేక పోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలను నేర్పించాలని నిబంధనలున్నా అధికారుల నిర్లక్ష్యంతో నిబంధనలు నీరుగారుతున్నాయి. మండలంలో చాలా మంది విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభను కనబర్చుతున్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకోవడానికి వివిధ ఆటవస్తువులను ఏర్పాటు చేయాల్సి ఉండగా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. 28 ప్రాథమిక పాఠశాలలు, 15 ప్రాథమికోన్నత పాఠశాలలు, 11 ఉన్నత పాఠశాలలున్నాయి. వాటితోపాటు ఉర్దూ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయలేదు. విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడామైదానాలను ఏర్పాటు చేసి, క్రీడలకు కావల్సిన ఆటవస్తువులను సమకూర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.



జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆటలాడుతున్న విద్యార్థులు

వాగుపై వంతెన నిర్మించండి

అయిజ: మండలం లోని సింధనూర్ గ్రామం వద్ద వాగుపై వంతెన నిర్మించక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి ప్రజలు ఈ రోడ్డుపై ప్రతిరోజు ప్రయాణం చేస్తుంటారు. వాగు ప్రదేశంలో గతంలో సీసీ బెడ్డు నిర్మాణం చేపట్టారు. వర్షాకాలంలో ఎరువులు, పురుగు మందులకు రైతులు ఎద్దులబండ్లు, ఆటోల్లో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. వాగులు వంకల నుంచి వచ్చిన వరదనీరు సీసీ బెడ్డుపై ఎక్కి ప్రవహించినంతసేపు ఆ ప్రదేశంలో ప్రయాణానికి ప్రతికూలత ఏర్పడుతుంది. దాని వల్ల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టి వర్షాకాలం నాటికైనా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సింధనూర్ వద్ద వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

నేటినుంచి ఉత్సవాలు

అయిజ: మండల కేంద్రంలోని రాజాపురంలో ఈనెల 23 నుంచి 27 వరకు జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పల్లకీసేవ, స్వామివారికి తుంగభద్ర నది నీటితో స్నానం, శ్రీదేవి, భూదేవితో గుంటరంగనాథ స్వామి కల్యాణం నిర్వహించనున్నారు. శనివారం రాత్రి స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు.